క్లుప్తంగా

'మధ్యాహ్నం'లో నాణ్యత లోపించనీయొద్దు



మాట్లాడుతున్న ఎంఈఓ ఈరన్న

హాలహర్వి: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో నాణ్యత లోపించకుండా చూడాలని ఎంఈఓ-1 ఈరన్న సూచించారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు, వంటల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

పోలీస్ బందోబస్తు మధ్య మార్కెట్ వేలం



బిల్లేకల్లులో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు దినసరి కూరగాయలు మార్కెట్ వేలం భారీ పోలీస్ బందోబస్తు మధ్య సర్పంచ్ శ్రీను ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గ్రామంలో పంచాయతీ కార్యలయ అవరణలో 2024-25 సంవత్సరానికి సంబంధించి దినసరి కూరగాయలు మార్కెట్ వేలం వేయగా రూ.45.64 లక్షలకు బాట వీరేష్ దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 58.50 లక్షలు పలకగా, ఈసారి రూ.45.64 లక్షలకు పలకడంతో పంచాయతీకి రూ.12.86లక్షలు ఆదాయం తగ్గింది. వేలంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ రామమ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆస్పరి సీఐ మస్తాన్‌వలితో పాటు ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలు, 30 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

హాలహర్వి: ఏవైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆ శాఖ ఏఈ జంబన్న సూచించారు. బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మన్‌లతో సమావేశం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాల వద్దకు ప్రజలు వెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవాలని చెప్పారు. ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు.

44వేల ఎకరాల్లో పంట నమోదు

కృష్ణగిరి: మండలంలో సాగు చేసిన 44 వేల ఎకరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసినట్లు ఏఓ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంతో పాటు ఎస్‌హెచ్ ఎర్రగుడి తదితర గ్రామాల్లో పంట నమోదును బుధవారం పరిశీలించారు. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 63వేల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 44 వేల ఎకరాల్లో పంట నమోదు చేశామన్నారు. మిగిలిన వాటిని కూడా ఈ నెల 15వ తేదీలోగా నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

దాడి.. కేసు నమోదు

కృష్ణగిరి: టి.గోకులపాడు గ్రామానికి చెందిన సురేష్, సురేంద్రపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. గ్రామానికి చెందిన బోయ పగిడాల జయరాముడు స్థలంలో వారిద్దరూ ఇద్దరు కంచే వేశారు. అది చూసిన ఫిర్యాదుదారుడు, అతని అన్న రామకృష్ణ కంచే తీసివేయాలని చెప్పినా తీసివేయకపోవడంతో మంగళవారం కంచె తొలగించారు. నిందితులిద్దరూ జయరాముడు ఇంటి వద్దకు వచ్చి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వివరించారు.

నివాళి

తుగ్గలి : వైఎస్సార్‌సీపీ నాయకులు మాదిరెడ్డి ప్రతాపరెడ్డి, ప్రహ్లాదరెడ్డి సోదరుల 4వ వర్ధంతిని బుధవారం తుగ్గలిలోని వారి స్వగృహంలో నిర్వహించారు. వారి చిత్ర పటాలకు వైఎస్సార్‌సీపీ నేతలు కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్. రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, విజయలక్ష్మి, సావిత్రమ్మ, తుగ్గలి, మద్దికెర మండలాల జెడ్పీటీసీ సభ్యులు పులికొండనాయక్, మురళీధరరెడ్డి, ఎంపీపీ నాగప్ప, వైస్ ఎంపీపీ మల్లికార్జున రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు నాగేష్, నాయకులు ప్రభాకరరెడ్డి, రామచంద్రారెడ్డి, మోహన్ రెడ్డి, నారాయణనాయక్, హనుమంతు, నాగభూషణరెడ్డి, గోపాల్‌రెడ్డి, సుధాకరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, రఘు, రాజు, మనీంద్ర నివాళులర్పించారు.

సరుకులు, పరిహారం పంపిణీ

చిప్పగిరి: కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో ఇళ్లు కూలిపోయి నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని కాజీపురం, ఏరూరు, నగరడోణ తదితర గ్రామాల్లో ఇళ్లు కూలిపోయిన బాధితులకు తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్ ఆధ్వర్యంలో రూ, 4వేలు, నిత్యావసర సరుకులు బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 8 మంది బాధితులను గుర్తించామన్నారు. సీనియర్ అసిస్టెంట్ మధుసుధన్ ఆచారి, వీఆర్ఓ తిమ్మప్ప పాల్గొన్నారు.



గుంతలమయమైన ఏరూరు వెళ్లే రోడ్డు



దేగులహాలు గ్రామ రోడ్డు ఇలా..



నంచర్ల రోడ్డు తీరిది..

రోడ్లు అధ్వానం.. ప్రజలు అవస్థలమయం!

ఆస్పరి: మండలంలోని కలపరి నుంచి ఆదోనికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కలపరి నుంచి బైలుపత్తికొండ, బసరకోడు వరకు 10 కి.మీ. రోడ్డు మోకాల్లోతు గుంతలు పడడంతో వాహనాలు అతి కష్టం మీద ఆదోనికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. చాలా సందర్భాల్లో ద్విచక్ర వాహనాలు బోల్తాపడి వాహనదారులు గాయపడిన సంఘటనలు అనేకం. గ్రామస్తులు ఎరువులు, విత్తనాలు, సరుకులు తెచ్చుకునేందుకు ఆదోనికి వెళ్లాల్సిందే. దీంతో నిత్యం గ్రామం నుంచి రాకపోకలు సాగుతుంటాయి . అలాగే.. ఆదోని మండలం చిన్న పెండెకల్లు గ్రామానికి చెందిన 10 ట్రాక్టర్లు వెంగళాయిదొడ్డి చెరువులో ఉన్న ఇసుకను ఈ మార్గం ద్వారా తీసుకెళ్తుండటంతో



అధ్వానంగా మారిన కలపరి - ఆదోని రోడ్డు

రోడ్డు మరింత అధ్వానంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, ఇసుక ట్రాక్టర్లును తిరగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

చిప్పగిరి: ఒక ప్రాంతం అభివృద్ధిని నిర్దేశించేది రహదారులేనని నానుడి ఉంది. అయితే అభివృద్ధి మాట అటుంచితే మండలంలోని పలు గ్రామాల రోడ్లు కనీసం రాకపోకలు సాగించేందుకు కూడా వీలుకాని పరిస్థితి నెలకొంది. ప్రతి గ్రామం రోడ్డు గుంతలమయమే. నిత్యం ఏదో ఒక గ్రామం నుంచి రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అధికారులు స్పందించి కనీసం గుంతలైన పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా,దౌల్తాపురం ,నంచర్ల,ఏరూరు,డేగులహాలు,రామదుర్గం,నేమకల్లు,తిమ్మాపురం,సంఘాల,ఖాజీపురం తదితర గ్రామాల రోడ్లు అడుగుకో గుంత అన్న చందంగా మారాయి.

గుంతలమయం కర్నూలు-బళ్లారి రహదారి



పెద్దహోతూరు గ్రామ సమీపంలో గుంతలమయంగా మారిన కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారి





ఆలూరు రూరల్: కురుస్తున్న వర్షాలతో రోడ్లు మడుగులను తలపిస్తున్నాయి. ఇప్పటికే ధ్వంసమైన రోడ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గుంతల్లో వర్షపు నీరు నిలిచి గుంతలు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి. అలాగే..భారీ వాహనాలు తిరుగుతుండటంతో గుంతలు మరింత పెద్దవిగా మారి ప్రమాదకరంగా మారాయి. మండలంలోని కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారిలో పడిన గోతులతో ప్రయాణికులు,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బళ్లారి నుంచి కర్నూలుకు వెళ్లాలంటే ఈ రోడ్డే ఆధారం. ఆలూరు నుంచి పెద్దహోతూరు గ్రామం వరకు 12 కి.మీ. మేర పూర్తిగా దెబ్బతింది. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

- పంట నష్టంపై నివేదికలు ఇవ్వండి
- కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- పగిడిరాయి వద్ద వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

అధైర్య పడొద్దు..ఆదుకుంటాం



పగిడిరాయి వద్ద రైతులను అడిగి పంట నష్టం వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రంజిత్‌బాషా



జొన్నగిరి ఎస్సీ హాస్టల్‌లో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్

తుగ్గలి : పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని, అధైర్య పడొద్దని కలెక్టర్ పి. రంజిత్‌బాషా తెలిపారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి నివేదికలు పంపాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్, అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం మండల పరిధిలోని పగిడిరాయి సమీపంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. పంటలను పరిశీలించిన ఆయన రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఆముదం, టమాట, కంది, సజ్జ పంటల సాగుకు ఎకరాకు ఎంత పెట్టుబడి అవుతుంది..ఎంత దిగుబడి వస్తుంది..ఆదాయం ఎంత వస్తుందనే అంశాలపై ఆరా తీశారు. ఏటా వర్షాలకు ఇలాగే పంటలు పాడవుతున్నాయా అని అడిగారు. అధిక వర్షాలు కురిసినప్పుడు మాత్రమే లోతట్టు పొలాల్లో నీరు ఎక్కువై పంటలు దెబ్బతిని నష్ట పోతున్నాయని రైతులు వాపోయారు. వర్షాలకు నీరు ఎక్కువై పంటలు దెబ్బ తినకుండా ఉండేందుకు పొలాల్లో ఉపాధి హామీ పథకం కింద ఫీడర్ చానళ్లు ఏర్పాటు చేయాలని ఏపీఓ రామకృష్ణను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ జొన్నగిరిలో ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని గదులు, స్టోర్‌రూం, వంటగది తనిఖీ చేసి భోజన నాణ్యతను పరిశీలించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అందరికీ విద్యా సామగ్రి అందిందా అని ఆరా తీశారు. సీబీఎస్ సిలబస్ అమలవుతున్నందున విద్యార్థులు కష్టపడి చదివి అందరూ పదిలో ఉత్తీర్ణులు కావాలని చెప్పారు. మెనూ గురించి ప్రశ్నించగా.. బాగా ఉందని విద్యార్థులు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. చదువులో వెనుక బడిన విద్యార్థుల కోసం రోజుకొక సబ్జెక్టు బోధించేలా ఉపాధ్యాయులను సంప్రదించాలని వార్డన్ రమేష్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఏఓ వరలక్ష్మి, డీపీఓ నాగరాజునాయుడు, సోషల్ వెల్ఫేర్ జేడీ రంగలక్ష్మిదేవి, ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ నాగరాజు, రూరల్ సీఐ పులిశేఖర్, ఎంపీడీఓ సావిత్రి, సర్పంచ్‌లు సౌజన్య, ఓబులేసు, ఎంపీపీ నాగప్ప, ఏఓ పవన్‌కుమార్, ఈవోఆర్డీ గోపాల్, ఎంఈవో రామవెంకటేశ్వర్లు, వీఆర్వోలు రంగన్న, కిరణ్‌కుమార్, రహిమాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపాలి



విద్యార్థుల జీవితాల్లో విద్యతో వెలుగు నింపాలి. నిజ జీవితంలో ఉపాధ్యాయుడికి ఆదరణ తగ్గలేదు. తన శిష్యులు ఉన్నత శిఖరాలకు చేరాలనే తపన ఉపాధ్యాయుడికి మాత్రమే ఉంటుంది. అది మా తరగని నిధిగా భావిస్తాం. నాకు రెండో సారి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. – సి. నరసింహులు అరికెర గురుకుల బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు

ఉపాధ్యాయుడి పాత్ర కీలకం



దేశానికి మార్గనిర్దేశకులను, మేధావులను తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం. అందుకు ఉపాధ్యాయుడి పాత్ర ఎనలేనిది. దేశంలో అన్ని రంగాల్లో నేడు యువతీ, యువకులు రాణిస్తున్నారంటే అందులో గురువుల శ్రమ,కృషి ఉంది. తన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉంటే అమితంగా సంతోషపడేది మొదట ఉపాధ్యాయుడే. –సుధాశేఖర్ సిద్ధాపురం గ్రామ ఎంపీపీ పాఠశాల హెచ్ఎం

సంతోషంగా ఉంది



ఉద్యోగ విరమణ చేసే ముందు ఉత్తమ ఉపాధ్యాయిని ఎంపిక కావడం సంతోషంగా ఉంది. విధి నిర్వహణ, విద్యార్థులపై ఏకాగ్రతతో పనిచేయాలి. అధికారులు గుర్తించినా గుర్తించకపోయినా నిరక్షరాస్యుల విద్యార్థుల జీవితాల్లో చదువు అనే వెలుగులు నింపాననే సంతృప్తి మిగిలింది. సమాజంలో గురువులకు ఆదర అభిమానులు ఉన్నాయి. వాటిని నేటి ఉపాధ్యాయులు కాపాడుకోవాలి. – మంజులమ్మ, ఆలూరు మెయిన్ ఎంపీపీ పాఠశాల

బాధ్యత మరింత పెరిగింది



అవార్డు రావడంతో బాధ్యత పెంచింది. ములుగుందంలో 8 సంవత్సరాలుగా పని చేస్తున్నా. నేను వచ్చినప్పుడు 150 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. గ్రామంలో తల్లిదండ్రులలో అవగాహన కల్పించి విద్యార్థుల సంఖ్య 235కు పెంచా. చదువుతో పాటు విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతాం. ప్రతి రెండు నెలకోసారి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వస్తాం. ఎవరైనా విద్యార్థి బడికి రాకపోతే వారి ఇంటి దగ్గకు వెళ్లి తల్లిదండ్రులకు నచ్చజెప్పి పాఠశాలకు వచ్చేటట్లు చేస్తున్నా.

– టి. యల్లప్ప హెచ్ఎం. ములుగుందం బీసీ ప్రాథమిక పాఠశాల

నా విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులయ్యారు



జిల్లా ఉత్తమ అవార్డు రావడం సంతోషంగా ఉంది. విద్యార్థులకు క్రమ శిక్షణతో పాటు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించడంతో నేను పని చేసిన స్కూళ్లలో హిందీ సబ్జెక్టులో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. నేను మొదటగా హాలహర్వి మండలం చింతకుంట జెడ్పీహెచ్ఎస్‌లో పదేళ్లు, పెద్ద తుంబళంలో రెండేళ్లు, బదినెహాళ్లో రెండేళ్లు, ములుగుందంలో 5ఏళ్లుగా పని చేస్తున్నా. ములుగుందంలో గదుల కొరత ఉన్నందున గ్రామస్తుల సహకారంతో రెండు రేకుల షెడ్లు వేయించాం. బాలికలకు అవేర్నెస్ ప్రోగ్రాంలు చేపట్టాం.

– కె. మెరిన్‌బీ, హిందీ పండిట్, ములుగుందం జెడ్పీహెచ్ఎస్

గురు సాక్షాత్ పరబ్రహ్మ

ఆలూరు: తరాలు మారినా గురువు స్థానం మారలేదు. నేడు ఆధునికతను అందిపుచ్చుకొని నూతన విధానాల్లో బోధన సాగిస్తూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నారు. గురువారం గురుపూజోత్సవ దినోత్సవంగా ప్రభుత్వాలు ప్రకటించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం సన్మానించనుంది. ఇందుకు నియోజకవర్గంలోని పలు పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వారు సాక్షితో తమ భావాలను పంచుకున్నారు.



విద్యార్థులకు బోధన చేస్తున్న అక్తరున్నీసా

హొళగుంద: మండలంలోని హెబ్బటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ టీచరుగా పని చేస్తున్న అక్తరున్నీసాకు ఉత్తమ టీచర్ అవార్డు వరించింది. ఒక్క రోజు కూడా పాఠశాలకు సెలవు పెట్టకుండా విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించడంలో ఆమె దిట్ట.

హొళ'గుంత'

- మండల కేంద్రంలో అధ్వానంగా మారిన రోడ్లు
- గుంతల రోడ్లపై రాకపోకలు సాగించలేకపోతున్న జనం
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



హొళగుంద: మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో అడుగడుగునా గుంతలు పడి రాళ్లు, తేలి ప్రమాదకరంగా మారాయి. బస్టాండు నుంచి వాల్మీకి సర్కిల్ వరకు దాదపు కిలోమీటర్ ముందుకెళ్లాలంటే నరకమే. బైకులు, నాలుగు చక్రాల వాహనాల్లో ఈ ప్రాంతంలో వెళ్లడం గగనమే. వర్షాకాలం కావడం గుంతలు మరింత పెద్దవిగా మారి బైకిస్టులు జారి పడిపోతున్నారు.నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరమే. వరపేట బసవేశ్వర, ఈర్లకట్ట, శ్మశానం తదితర రోడ్లు కూడా అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





హొళగుందలో గుంతలు పడి అధ్వానంగా మారిన రోడ్లు

మధ్యాహ్న భోజనంపై వర్క్‌షాప్

కృష్ణగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో ఏవైనా మార్పులు చేయాలా అనే దానిపై అభిప్రయాలు సేకరిస్తున్నట్లు ఎంఈఓ-2 మద్దయ్య తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన వైద్యాధికారి వరప్రసాద్, ఎంపీడీఓ విశ్వమోహన్‌తో కలిసి హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు, వంట ఏజెన్సీలతో మధ్యాహ్న భోజనంపై వర్క్‌షాప్ నిర్వహించారు. మెనూలో మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటే తెలియజేయాలని కోరారు.

వినాయక విగ్రహం చోరీ

హొళగుంద: వినాయకుడి విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద బల్లారు శేషప్ప విగ్రహాలను తయారు చేసి అమ్మకానికి ఉంచాడు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బొలెరో వాహనంలో వచ్చి ఓ విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పత్తికొండ(తుగ్గలి) : గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం డీఎస్పీ వెంకటరామయ్యతో కలిసి గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి భూగర్భజలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రోడ్లపై మండపాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ప్రతి మండపం వద్ద పగలు, రాత్రి నిర్వాహకులు తప్పకుండా కాపలా ఉండాలన్నారు. సంప్రదాయబద్ధంగా..ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను జరుపు కోవాలని చెప్పారు. నిమజ్జన యాత్ర పూర్తయ్యే వరకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో రూరల్ సీఐ పులిశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ రామలక్ష్మి.

చిప్పగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపు తదితర కార్యక్రమాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఏవైనా గొడవలు జరిగితే కమిటీ సభ్యులదే బాధ్యత అని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పటు చేస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఆలూరు: గణేష్ ఉత్సవాల సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా సింగిల్ విండో ద్వారా అనుమతి పొందాలని, ఆలూరు సీఐ కె.శ్రీనివాసనాయక్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ విగ్రహాలకు ప్రత్యేకంగా క్యూర్ కోడ్‌ను మంజూరు చేస్తున్నామన్నారు. ప్రధానంగా పోలీసు, రెవెన్యూ విద్యుత్ శాఖల అనుమతి ఉన్న కమిటీలకు ఎస్ఐలు అనుమతి ఇవ్వాలని సూచనలు చేసినట్లు చెప్పారు.

కృష్ణగిరి: వినాయక చవితి ఉత్సవాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయక విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు, నిమజ్జనం ఎప్పుడు, ఏమైనా కార్యక్రమాలు నిర్వహిస్తే వాటి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. నిబంధనలు పాటించకపోతే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే.. పండుగల సీజన్‌లో ఆన్‌లైన్‌లో మీ ఫోన్ నంబర్‌కు లక్కీడ్రా తగిలిందని, పథకాల్లో లబ్ధిదారులు అయ్యారు ఓటీపీ చెప్పండని ఫోన్లు చేస్తుంటారని స్పందించవద్దని సూచించారు.